## కోరుకున్న జీవితం దొరికినా ఆమెలో అసంతృప్తికి కారణం?

# కోరుకున్న జీవితం

## జి. పి. కిరణ్ కథ

లలిత తనకు రాసిన లెటర్‌లోని అడ్రస్‌ని మరోసారి చూసుకుంది హైమ. సందేహంలేదు. ఇదే ఇల్లు. అయినా లలిత ఇంత పెద్ద ఇంటిలోకి ఎప్పుడు మారింది. చాన్నాళ్ల తరువాత లలిత తనకు లెటర్ రాయడం తనను వెంటనే బయలుదేరి రమ్మనటం, తీరా వచ్చి చూస్తే ఇల్లేమో ఇంద్రభవనం, ఏమిటో అంతా విచిత్రంగా వుంది అనుకుంటూ కాలింగ్ బెల్ నొక్కింది.

ఎవరో అపరిచిత ఆడమనిషి తలుపు తెరవడంతో "లలిత వుండే ఇల్లు ఇదేనా?" అనడిగింది.

"అవునండీ, మీరు... లోనికి రండమ్మా, అమ్మగార్ని పిలుస్తాను" అంటూ లోనికి తీసుకువెళ్లింది.

సోఫాలో కూర్చున్న హైమ ఆ కాస్సేపు ఆ గదిని పరిశీలించకుండా వుండలేకపోయింది. కాళ్లకింద మెత్తటి కార్పెట్, ఎదురుగా కలర్ టి.వి., వి.సి.ఆర్, ఒక మూలగా ఎయిర్ కూలర్, మరో ప్రక్క టెలిఫోన్, గోడకి బిగించబడిన లామినేటెడ్ ఫోటో. అందులో లలిత, ఆమె ప్రక్కన తనింతవరకూ చూడని వ్యక్తి, ఇంకా పరీక్షించడంలోనే ఉన్న హైమకు అడుగుల చప్పుడు వినిపించడంతో తల తిప్పింది.

అప్పుడే ఆ గదిలోకి వచ్చిన లలిత, హైమను చూసి ఒక్కసారిగా ఉద్వేగానికి లోనయింది.

హైమని గట్టిగాచుట్టేసి "థాంక్స్యూ హైమా.. థాంక్స్యూ వెరీమచ్. నా మాట మన్నించి వచ్చినందుకు నీకెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడంలేదు!" ఒకింత సంభ్రమంగా అంది లలిత.

హైమ పరిస్థితికూడా దాదాపుగా అంతే.



''లే హైమా, స్నానం చేద్దువుగాని, ప్రయాణ బడలికమీదుండుంటావు'' అంటూ లేపింది లలిత.

○ ○ ○

''చెప్పు లలితా. ఎందుకు నన్ను ఉన్న ఫళాన రమ్మని లెటర్ రాశావు. అసలు ఏం జరిగింది. ఏదీ ప్రాబ్లమ్?''

''ఏమీ లేదులేవే. తర్వాత చెపుతాను.

ముందు టి.వి. చూడు. పిక్చర్ చాలా ఇంటరెస్టింగ్‌గా వుంది''

''పిక్చర్ కావాలంటే తర్వాత చూడవచ్చు. నన్ను రమ్మనమన్న కారణం ఏమిటో ప్రొద్దుట అడిగితే సాయంత్రం చెబుతానన్నావు. ఇప్పుడేమో తర్వాతంటున్నావు'' అని హైమ కసురుకునేసరికి ''ఇప్పుడే చెపుతాలేవే. అసలు నిన్ను పిలిచింది విచిత్రంగా మారిన నా జీవితాన్ని నీకు వివరిద్దామనే. అయితే ఎందుకోనే కొంచెం బిడియంగా వుంది'' కళ్లలో తిరిగిన నీటిపొర బయటపడకుండా తల తిప్పుకుంటూ అంది లలిత.

పరిస్థితిని అర్థం చేసుకున్న హైమ ''ఛ. నా ముందు నీకు బిడియం ఏమిటే. సృష్టిలో ఇద్దరు వ్యక్తులు ఒక రహస్యాన్ని పంచుకోగలిగారంటే వారిద్దరూ తప్పకుండా స్నేహితులే అయి వుంటారు. అంతేకానీ తల్లీ కూతుళ్లో, తండ్రీ కొడుకులో, భార్యాభర్తలో అయి వుండరు. ఒకవేళ వీరు కూడా ఒకరి రహస్యాన్ని మరొకరికి చెప్పుకోగలిగారంటే తమ మధ్య బంధుత్వంతోపాటు స్నేహబంధాన్నికూడా పెంపొందించుకోగలిగినవారై వుండాలి. సరేగానీ నీ ప్రాబ్లం ఏమిటో చెప్పు'' అంది హైమ.

''ఇక్కడ కాదు. అలా బైటకు వెళ్లి మాట్లాడుకుందాం పద.'' ఎక్కమని డోర్ తీసి పట్టుకుంది.

సిటీలోని నియాన్ లైట్ల వెలుగులో కారు మెత్తగా సాగిపోతుంది. ''లలితా నీకు డ్రైవింగ్‌కూడా వచ్చా? చిన్నప్పుడు సైకిలెక్కడానికే తెగ భయపడిపోయేదానివి!'' ఆసక్తిని ఆపుకోలేక అడిగింది హైమ. చిన్నగా నవ్వి ''పెరిగిన నా అంతస్థు నాకు నేర్పించింది. ఇదేకాదు. ఎన్నింటినో... ఎన్నింటినో నేర్పించింది. హైమా, నీకు ఆశ్చర్యంగా లేదు. నేను, నా చుట్టూ ఇంత సంపద, నేను ఎంతో ఇష్టపడి పెళ్లి చేసుకున్న సూర్యం నువ్వొచ్చి ఇంతసేపైనా నీకు కనపడకపోవడం, కనీసం పిల్లలుకూడా లేకపోవడం ఇవేమీ... ఇవేమీ నీకు ఆశ్చర్యం కలిగించడంలేదా?'' కాస్తంత ఉద్విగ్నంగా అంది లలిత.

''ఆశ్చర్యాన్ని కలిగించినా నువ్వే అంతా విరిస్తావని నేనేమీ అడగలేదు'' అంది హైమ.

మాటల్లో వుండగానే కారు టాంక్‌బండ్‌మీదికొచ్చింది. ఒకపక్కగా పార్కుచేసి కారు దిగి జనం పలచగా ఉన్న చోటుకు వెళ్లి సిమెంట్ బెంచిమీద కూర్చున్నారు.

నిదానంగా చెప్పడం ప్రారంభించింది లలిత.

''పెద్దలు కుదిర్చిన సంబంధమే అయినా సూర్యాన్ని నేను ఎంతగా ప్రేమించానో, ఎంత అమాయకంగా, ఎన్ని ఆశలతో అతన్ని పెళ్లాడానో నీకు తెలుసు. పెళ్లయ్యేనాటికి నా మానసిక పరిధి చాలా చిన్నది. అప్పటివరకూ నేనూ, నా తల్లి, తండ్రి, ఇద్దరు చెల్లెళ్లు, స్నేహితులు ముఖ్యంగా నీవు. పెళ్లయ్యాక ఆ పరిధిని ఇంకాస్త పెంచుకుని నా భర్త, పిల్లలు కలిపి నా కుటుంబం ఇంతే చాలనుకున్నాను. కానీ ఆ సూర్యానికి డబ్బుపిచ్చి. అప్పటివరకూ నా పేర ఉన్న కొద్దిపాటి ఆస్తిని తనపేర రాయించుకున్నాడు. అయినా నేనేమీ బాధపడలేదు. నా డిగ్రీ చదువు అతనికో ఆలోచన నిచ్చింది. ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చూపించి చేయమన్నాడు. కారణం అడిగితే ఆర్థిక పరిస్థితి అటువంటిది తప్పదన్నాడు. మీ ఆర్థిక పరిస్థితి మాకు తెలియందికాదు. ఆయనకు బయట వేరే స్త్రీతో సంబంధం వుందని నాకు

తెలిసింది. అప్పటికే మాకు ఒక బిడ్డ. ఆడది ఉద్యోగం చేయడం తప్పు అని నా ఉద్దేశ్యం కాదు. కానీ నేను పెంచుకున్న ఆశలు వేరు. ప్రొద్దుటే లేచి చకచకా వంట పని పూర్తిచేసి టైముకి భర్తని ఆఫీసుకి, పిల్లల్ని స్కూలుకి పంపి ఆపై మిగిలిన ఇంటిపనిని పూర్తిచేసి, ఇల్లంతా నీటుగా సర్ది, భర్త, పిల్లలు సాయంత్రం ఇంటికొచ్చేసరికి వారికోసం ఏదైనా తినడానికి తయారుచేసి వారి అలసటను తీర్చి తృప్తి పొందాలి. ఆపై పిల్లలు హోమ్‌వర్క్ చేసుకుంటుంటే వారికి సహకరించి వారి తప్పుల్ని దిద్ది వారిని చక్కగా తీర్చిదిద్దాలి. ఒక గృహిణిగా నా జీవితం ఇలా సాగాలి అని నేను కన్నెపిల్లగా ఉన్నప్పుడే నిర్ణయించుకున్నాను. ఒక మధ్యతరగతి ఆడపిల్లగా.

అయినా మనసు చంపుకుని ఉద్యోగానికి వెళ్లాను. కానీ, ఎందుకో ఇమడలేకపోయాను. కొన్నాళ్లకి అర్ధమయింది. ఉద్యోగం చేయడం నావల్లకాదని. ఆనాటినుంచి నామీద సాధింపులు ఎక్కువయ్యాయి. నేను ఆ ఇంట్లో తేరగా పడి తింటున్నట్లుగా మాట్లాడసాగారు. భార్యని నన్ను అలా అనడం నేను సహించలేకపోయాను. ఎదురుతిరిగాను. నేను కన్న కలలు కల్లలు అవుతుంటే నిస్సహాయురాలినే అయ్యాను.

ఆ సమయంలోనే నాకు రాజేష్ పరిచయమయ్యాడు. ఓ సారీ... రాజేష్ ఎవరో నీకు తెలియదు కదూ. ప్రస్తుత నా భర్త. నా సంరక్షకుడు. నేను పడే బాధలు చూశాడు. సూర్యానికి నచ్చచెప్పాలని ఎంతో ప్రయత్నించాడు. అయినా సూర్యం తన ధోరణి విడవలేదు. ఆ సమయంలోనే రాజేష్ నాకు చేరువయ్యాడు. అతను భార్యాబాధితుడు. ఇంట్లో వున్న కాస్సేపు అతను అశాంతినే చవిచూసేవాడు. నేను నా భర్తనుంచి పొందలేని ప్రేమను అతనినుంచి పొందగలిగాను. అతని భార్య అందించలేని అభిమానాన్ని నేను అతనికి అందించాను. మా ఇద్దరి సమక్షంలో గంటలు క్షణాల్లా గడిచిపోయేవి. గాయపడ్డ హృదయాలు రెండూ ఎంతో స్వాంతన పొందేవి.

## ఆకాశంలో వంతెన



• వంతెనలంటే దుమ్ము ధూళితో రకరకాల మరకలతో ఇనుప ఊచలపై నిలబడిన తారు రహదారులే కళ్లముందు మెదులతాయి. కాని అందమైన అద్దాల వంతెనలపై నడవడం ఊహించుకుని చూడండి - ఎంత రమ్యంగా వుంటుందో?

నెదర్లాండ్స్‌కు చెందిన క్రాజివెంజర్ - అర్బిస్ ఆర్కిటెక్ట్స్ ఓ బిల్డింగ్‌కు - మరో బిల్డింగ్‌కు మధ్య ఈ గాజు బ్రిడ్జిలను నిర్మించారు. ఈ బిల్డింగ్‌నుంచి ఆ బిల్డింగ్‌కి హాయిగా నడుచుకుంటూ వెళ్లిపోవచ్చు.

క్రిందనుంచి చూసేవారికి మాత్రం ఆకాశంలో మనుషులు నడుచుకుంటూ వెళ్లినట్లుగా అనిపిస్తుంది.

- వినూత్న

కొద్దిరోజులకి ఈ విషయం సూర్యానికి తెలిసిపోయింది. అగ్గిమీద గుగ్గిలమే అయ్యాడు. రాజేష్ ఇచ్చిన ధైర్యంతో సూర్యంనుంచి విడిపోయాను. ప్రస్తుతం రాజేష్‌కు రెండవ భార్యగా జీవితాన్ని గడిపేస్తున్నాను. అయితే ఇంతవరకూ సూర్యం, నేను లీగల్‌గా డైవోర్సు ఏమీ తీసుకోలేదు'' అని ఆపింది లలిత.

''అబ్బ దాహంగా వుంది లలితా'' అని హైమ అడగడంతో వెళ్లి వాటర్ బాటిల్ తెచ్చిచ్చింది లలిత.

''హైమా! నేనేమన్నా తప్పు చేశానంటావా? ఒక విధమైన గిల్టీ ఫీలింగ్‌వల్లే ఈ విషయాలేవీ నీకు తెలియపర్చలేదు'' అంది లలిత.

''జరిగిందేదో జరిగింది. అది తప్పో, ఒప్పో అని ఇప్పుడు సమీక్షించుకున్నందువల్ల లాభం ఏమీ లేదు. ఏం చేసినా ఎదుటివారికి బాధ కలగకుండా వుండాలి. నీవు చేసిన పనివల్ల సూర్యం పెద్దగా బాధపడి వుండడని నీవు చెప్పినదాన్నిబట్టి అనిపిస్తుంది. ఇక రెండవ వ్యక్తి రాజేష్ భార్య. రాజేష్ నీ పట్ల ఆకర్షితుడు కావడానికి ఆమే కారణం అయితే ఆమె గురించి కూడా ఆలోచించవలసిన అవసరంలేదు. ఇక మిగిలింది నీ ఇద్దరు పిల్లలు. వారిగురించి నాకేమీ చెప్పలేదు. ఇంతకీ వారు ఎక్కడ వుంటున్నారు?''

''ఒకే ఊరు కాబట్టి సూర్యం దగ్గర కొన్నాళ్లు, నా దగ్గర కొన్నాళ్లు వుంటారు. రేపు ఉదయం పిల్లల్ని తీసుకురమ్మని ఎవరినన్నా పంపిస్తాను'' అంది లలిత.

''అది సరేకానీ, కేవలం ఇది చెప్పడానికే నన్ను పిలిచావా? కాదు. ఇంకేదో వుందికదు లలితా?''

''నిజమేనే. ఇప్పటివరకు నీకు చెప్పింది సగమే. మిగతా సగం రెండు రోజులు మా ఇంట్లో వుంటే నీవే గమనిస్తావు'

''అయితే సరే. పోదాం పద. ఇందాకట్నించి ఈ హుస్సేన్‌సాగర్ వాసన పీల్చీ పీల్చీ కడుపులో దేవేస్తోంది. తొందరగా పద'' అని అనేసరికి నవ్వుతూ కారు స్టార్ట్ చేసింది లలిత.

O O O

చిన్ననాటి కబుర్లు అన్నీ పూర్తయ్యేసరికి రాత్రి పన్నెండు దాటింది. ''లలితా! ఇంక పడుకుందామే'' అని హైమ అనేసరికి సరేనంటూ టేబుల్ సొరుగులోంచి ఏవో టాబ్లెట్స్ వేసుకుని పడుకుంది లలిత.

''ఏం టాబ్లెట్స్ లలితా అవి? ఒంట్లో బాగాలేదా?'' లలిత నుదుటిమీద చేయి వేస్తూ అడిగింది హైమ.

''స్లీపింగ్ పిల్స్.. ఒంట్లో బాగోకకాదు. ఒంటరితనానికి భయపడి, ఒంటరితనంనుంచి తప్పించుకుందామని చిన్న ప్రయత్నం అంతే.'' ప్రక్కకు తిరిగిపోతూ అంది లలిత.

''లలితా! రాజేష్ ఏం చేస్తుంటారు?''

''బిజినెస్. బడా బిజినెస్. క్షణం తీరిక లేని బిజినెస్. నేను రాకపూర్వం వేలల్లో వుండే బిజినెస్, నా రాకతో లక్షలు దాటి, కోట్లలో నడుస్తోంది. అందుకే రాజేష్‌కి నేనంటే ఎంతో ప్రేమ. నామీదకన్నా బిజినెస్‌మీద మరింత ప్రేమ. అందుకే ప్రతిక్షణం బిజినెస్ వ్యవహారాల్లోనే...''

''అర్థమయింది లలితా!'' దుప్పటి కప్పుకుంటూ అంది హైమ.

O O O

ఆ తర్వాత రోజు ఉదయం పది గంటలకు వచ్చారు పిల్లలు. వచ్చిన తర్వాత తల్లి దగ్గరకు ప్రేమగా, ఆప్యాయంగా వెళ్లడంగానీ ఏమీ

చేయకుండా టి.వి. ఛానల్స్ మారుస్తూ, చూస్తూ కూర్చున్నారు. పెద్దవాడికి ఏడు,. చిన్నవాడికి ఆరేళ్ల వయసు వుండవచ్చనిపించింది.

కాస్సేపటికి లలిత పిల్లలకు హైమను చూపిస్తూ ''ఈమె హైమ ఆంటీ. నాకు మంచి ఫ్రెండ్. వెళ్లండి, వెళ్లి ఆంటీతో ఆడుకోండి'' అంది.

హైమ వాళ్లను దగ్గరకు తీసుకుని మీ పేర్లేమిటని అడిగింది. చెప్పారు. మీ మమ్మీ పేరేమిటని అడిగిందని. దానికీ చెప్పారు. 'మీ డాడీ పేరేమిట'ని అడిగింది. దానికి వాళ్లు 'ఏ డాడీ?' అంటూ ఎదురుప్రశ్న వేసేసరికి తెల్లబోయింది.

''పిల్లలు రాజేష్‌నికూడా డాడీ అనే పిలుస్తారు!'' తల దించుకుని అంది లలిత.

ఇంతలో ఫోను మోగడంతో రిసీవర్ ఎత్తి ''హలో'' అంది.

''... ...''

''చాన్నాళ్లకి గుర్తు వచ్చానే. అసలు నేనొకదాన్ని ఈ భూమీమ్మీ ఉన్నానన్న స్పృహ నీకుందా అసలు''

''.... ... ...''


''ఏం అర్థం చేసుకోవాలి. దేశంలో నీవొక్కడివే బిజినెస్ చేస్తున్నావా? నీ బిజీ అంతా నీ భార్యతో గడపటమేగా. నాకు తెలియదనుకుంటున్నావా?''

''... ... ...''

''ఆ! మీ ఆఫీసులో చేసే అతను తెచ్చిచ్చాడు పదివేలు. పాత బ్యాలెన్స్‌లు తీర్చడంతోనే ఆ పదివేలూ అయిపోయాయి. అన్నట్టు నా స్నేహితురాలు హైమ అని విజయవాడనుంచి వచ్చింది. ఖర్చులకు డబ్బుకావాలి. కొంచెం పెద్ద అమౌంట్ పంపించు. సరే వుంటా''

ఫోన్ పెట్టేసి హైమవైపు తిరిగి ''రాజేష్'' అంది.

''అర్థం చేసుకున్నా. ఇంతకీ నీకు ఇంటి ఖర్చులకి సక్రమంగా, సరిపడినంత డబ్బు ఇస్తాడా?'' అడిగింది హైమ.



''డబ్బు విషయంలో ఏ లోటూ లేదు. నెలకి ఒక పదివేలు ఇంటి ఖర్చులకి ఇస్తాడు. మధ్యలో ఏమన్నా పండుగలు అవి వస్తే అడక్కుండానే ఇస్తాడు. ఈ ఇల్లు చూశావుగా కేవలం నాకోసమే కట్టించాడు. ఇంట్లో కాలికింద కార్పెట్‌నుంచి, బైటకెళ్లడానికి కారువరకూ అన్నీ అమర్చాడు. కానీ... కానీ నాకతడు ఇవ్వలేకపోతున్నది ఒకటే. అదే... తోడు. నేను కన్న కల ఒకటే. అదే నాకు మాత్రమే పరిమితమైన నా కుటుంబం. అందులో నేనూ, నా భర్త, నా పిల్లలు, మరొకరి ప్రమేయం అవసరం లేనంతగా మా మధ్య అల్లుకుపోయే ప్రేమ. ఇది మాత్రమే నేను కోరుకుంది. కానీ హైమా, నా దురదృష్టమేమిటోగానీ అగ్నిసాక్షిగా పెళ్లిచేసుకున్న సూర్యంవల్లగానీ, మనస్సాక్షిగా చేరువైన రాజేష్‌వల్లగానీ నా కల ఫలించలేదు. అప్పుడు సూర్యం ప్రక్కన వున్న ఒంటరితనం. ఇప్పుడు రాజేష్ రాకపోవడంవల్ల ఒంటరితనం. ఎన్నోసార్లు నా ఆవేదనని రాజేష్‌కి చెప్పిచూశాను. కానీ, నవ్వుతూ కొట్టిపారేస్తాడు. సూర్యం డబ్బు సంపాదనకోసం నన్ను వాడుకోవాలనుకుంటే, రాజేష్ డబ్బు సంపాదనలోపడి నన్ను నిర్లక్ష్యం చేస్తున్నాడు. అందుకే హైమా, నేనొక పని చేయాలనుకుంటున్నాను. అది మంచో, చెడో చెపుతావని నిన్ను పిలిచాను''

''ఏమిటది లలితా?'' అడిగింది హైమ.

''నేను రాజేష్‌నుంచి విడిపోదామని అనుకుంటున్నాను''

''వ్వాట్. రాజేష్‌నుంచి విడిపోతావా? మతి వుండే మాట్లాడుతున్నావా?''

''ఇంతకన్నా మరో మార్గం కనిపించడంలేదు హైమా! మన మాటకువిలువ ఇవ్వని వ్యక్తుల దగ్గర మనం ఎందుకుండాలి. అందుకే స్వతంత్రంగా బ్రతుకుదామనుకుంటున్నాను. ఏమంటావ్ హైమా!''

''నా అభిప్రాయం నేను వెళ్లబోయేముందు చెబుతాను'' అంది హైమ.

O O O

''లలితా! నే వచ్చి ఇప్పటికి వారం రోజులు అయింది. అక్కడ మీ అన్నయ్యగారు ఎంత ఇబ్బంది పడుతున్నారో! ఈ సాయంత్రం నేను బయలుదేరతానే'' అంది హైమ.

తనెంత బలవంతం చేసినా హైమ వుండకపోవడతో ఆ సాయంత్రం హైమని స్టేషన్ దగ్గర డ్రాప్ చేయడానికి కారు తియ్యబోయింది లలిత.

''సారీ, లలితా. స్టేషన్‌కి మనం సరదాగా ఆటోలో వెళదాం'' అంది హైమ.

''హైమా! నీ అభిప్రాయం ఇంతవరకూ చెప్పలేదు'' అంది లలిత ఆటోలో కూర్చుంటూ.

''తప్పకుండా చెపుతాను లలితా. కానీ, నా అభిప్రాయం నీకు నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. నన్ను మాత్రం అపార్థం చేసుకోవద్దు'' అంది హైమ.

''ఛ. అటువంటి దానినయితే నా కథంతా నీకెందుకు చెపుతాను. నీ అభిప్రాయం ఏదైనా సరే నేనేమీ అనుకోను!''

''నీవు రాజేష్‌నుంచి విడిపోతె జీవితంలో మరిన్ని సమస్యల్ని ఎదుర్కొంటావ్ లలితా! విలాసవంతమైన జీవితానికి బాగా అలవాటుపడిన నిన్ను బాగా గమనించాకే ఈ మాట చెపుతున్నాను. ఎంతసేపూ నేను కోరుకున్న జీవితం దక్కడంలేదని బాధపడతావేగానీ, ఆ జీవితాన్ని పొందడానికి నీవు సరైన ప్రయత్నం

చేశావా? సూర్యం, రాజేష్‌లు నీ తత్వానికి అనుగుణంగా లేరని బాధపడుతున్నావు. వారి మనస్తత్వం నీకు అనుగుణంగా వుండాలని ఎందుకు తపనపడతావు. ముందు మనం ఎదుటివారికి అనుగుణంగా మారి, తర్వాత వార్ని మనకు అనుగుణంగా మార్చుకోవడంలోనే వుంది మన తెలివంతా. రాజేష్ డబ్బు సంపాదనలో పడి నన్ను అలక్ష్యపెడుతున్నాడు అంటున్నావు. నిన్ను అలక్ష్యపెట్టి సంపాదించిన సొమ్మునే నీవు విలాసాలకు వినియోగించుకొంటున్నావు. కోరుకుంటున్నావు కాబట్టి అవసరం వుంది కాబట్టి అతను ఎంతగానో ప్రేమించే నిన్ను సైతం నిర్లక్ష్యం చేసి సంపాదిస్తున్నాడు. తన పూర్తి సమయాన్ని ధన సంపాదనలో పెడుతున్నాడు. ఆ డబ్బునే నీవు కాదంటే, నీ ప్రేమ మాత్రమే నాకు చాలని, కావాలని నీవు కోరితే అతను తప్పించుకోగలడా? కాదనగలడా? ఆలోచించు. అప్పటికీ రాజేష్ నీకు చేరువ కాకపోతే అప్పుడే అతన్నుంచి విడిపోవచ్చు. సాధారణ జీవితానికి అలవాటుపడి వుంటావు కాబట్టి అతన్నుంచి వేరయినా బ్రతకడం పెద్ద కష్టం కాదు.

చివరిగా ఒక విషయం ఈ ప్రయత్నంలో రాజేష్ మొదటిభార్యకు అన్యాయం జరుగకుండా చూడు. ఆవిడ ఎటువంటిదైనా రాజేష్‌ని పెళ్లాడిన స్త్రీ. ఇంకో ముఖ్యమైన విషయమేమిటంటే నీవు జీవితంలో చేసే పోరాంలో నీ పిల్లలు అన్యాయమైపోతున్నారు. తండ్రిపేరడిగితే ఏ డాడీ అని ప్రశ్నించిన వారు రేపటి రోజున పెరిగి పెద్దవారై ఏ విధంగా మారతారో చదువుకున్న నీకు నేను వేరే చెప్పనక్కరలేదు. దయచేసి వారిని సూర్యందగ్గరకానీ, నీ దగ్గరకానీ పెరిగేటట్లు చేయి. ఇది నీ హితం కోరే వ్యక్తిగా నా అభ్యర్థన, అభిప్రాయం కూడా!''

స్టేషన్ రావడంతో మాట్లాడడం ఆపుచేసి ఆటోదిగింది హైమ. లలిత ఏడుస్తోందని హైమకు తెలుసు. ఆవేదనతోపాటే ఆమెలో ఆలోచన మేలుకొంటుందని కూడా తెలుసు.

★

## గుర్తింపు

''ఏమయ్యా నీవు రోజూ ఆఫీసుకు లేటుగా వస్తున్నావేం''
అడిగాడు మేనేజర్...!

''లేకపోతే నేనొకడున్నానని ఆఫీస్ స్టాఫ్ ఎవరూ నన్ను గుర్తించడంలేదు సార్, అందుకని!''

''ఆ...!''

- ముత్యాల శ్రీ శరత్‌బాబు
(కొమరగిరిపట్నం)

